క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



ముదినేపల్లిరూరల్: వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు మంగళవారం కురిసిన అకాలవర్షంతో సేదతీరారు. ఉదయం నుంచి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడి మండలంలో గంట పాటు వర్షం కురిసింది. ముదినేపల్లి సెంటర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డు వర్షపు నీటితో నిండిపోయి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. వడాలి సెంటర్లో ఉన్న ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయంతో మారడంతో పెద్ద ఎత్తున వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. పలు గ్రామాల్లోని పల్లపుప్రాంతాల్లో ఉన్న అంతర్గత రోడ్లు నీట మునిగాయి.

అవ్వా, తాతలకు ఉచితంగా కంటి పరీక్షలు



తోట్లవల్లూరు: వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకరరావు సూచించారు. మండలంలోని బొడ్డపాడులో వైఎస్సార్ కంటి వెలుగు వైద్య శిబిరం మంగళవారం జరిగింది. ఆప్తాల్మిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ అరవై ఏళ్ల వయస్సు నిండిన అవ్వా, తాతలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కళ్లజోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందించటంతో పాటు ఆపరేషన్లు అవసరమైన వారికి రిఫర్ చేస్తామన్నారు. ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, హెల్త్ అసిస్టెంట్ మురళీకృష్ణంరాజు, ఏఎన్ఎం జ్యోతి, ఆశ కార్యకర్త నాగమణి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి వితరణ



గుడివాడటౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులో ఉన్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులకు భక్తులు రూ 10,116 వితరణగా ఇచ్చినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం తెలిపారు. గుడివాడకు చెందిన అడపా శరత్‌బాబు–స్వప్నజ దంపతులు ఆలయ అభివృద్ధి పనులకు, రాజగోపురం నిర్మాణానికి వినియోగించుకోవాలని ఈ మొత్తాలను ఇచ్చినట్లు తెలిపారు. శరత్‌బాబును ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ చందరాల హరిరాంబాబు, కమిటీ సభ్యులు టీఎస్‌వీ సాంబశివరావు, జోగా సూర్యప్రకాశరావు, జ్యోతుల శ్రీనివాస్, పీవీ సుబ్రహ్మణ్యం, ఆర్.శ్రీనివాసరావు, ఆర్.సుబ్రహ్మణ్యేశ్వరరావు అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి ఉపాధి పనులు దోహదం



మండవల్లి: గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పనులు దోహదం చేస్తున్నాయని ఇన్‌చార్జి ఏపీఓ ఎన్.నవీన్ అన్నారు. మండలంలోని అల్లినగరం గ్రామంలో రూ.3,60,000 అంచనా విలువతో ఊరచెరువు అభివృద్ధి పనులను మంగళవారం 186 మంది ఉపాధి కూలీలు నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే రోజే జగనన్న విద్యా కానుక



గుడివాడటౌన్: విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక అందేలా చర్యలు చేపడతామని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. స్థానిక ఏజీకే హైస్కూల్‌లో మంగళవారం జగనన్న విద్యా కానుక గోడౌన్‌లో సామగ్రిని ఆమె తనిఖీ చేశారు. మంచి నాణ్యత గల బ్యాగులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, 3 జతలు యూనిఫాం, బెల్ట్, టై, బూట్లు, సాక్సు ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలలకు చేరవేసిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ బీఎస్‌సీ శేఖర్‌సింగ్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

చరిత్రాత్మక పాలనకు సీఎం జగన్ శ్రీకారం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ఘనంగా నాలుగేళ్ల విజయోత్సవం



పామర్రులో ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు(పామర్రు): దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేస్తూ చరిత్రాత్మక పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో విజయోత్సవం మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమ న్యాయం కల్పిస్తూ వారి పురోభివృద్ధికి పాటుపడుతున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అనిల్‌కుమార్ అన్నారు. ప్రజలందరికీ సుపరిపాలన అందించటమే లక్ష్యంగా నూతన సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. ప్రజా హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి చంద్రబాబు అండ్ కో ఓర్వలేక పోతున్నారని చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎన్ని ఆటంకాలు కలిగించినప్పటికీ చెరగని చిరునవ్వుతో ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఇంటింటా సంక్షేమ పథకాలను అందించి విశ్వసనీయతకు మారుపేరుగా నిలిచిన జగనన్నకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు జేజేలు పలుకుతున్నారని అన్నారు.

చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదు

గత ఎన్నికలకు ముందు టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో 600కు పైగా హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చని చంద్రబాబుని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల జరిగిన మహానాడులో పిట్టలదొర మాదిరిగా అమలు సాధ్యం కాని హామీలను గుప్పించి ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నానికి శ్రీకారం చుట్టారని ఎద్దేవా చేశారు. బాబు దొంగ హామీలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా నెరవెరుస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే సరికొత్త రికార్డు సృష్టించారని అనిల్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కైకలూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

నాలుగేళ్ల సుపరిపాలన

: ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: ఆర్థిక, రాజకీయ ఆటంకాలు ఎదురైనప్పటికీ సమగ్ర అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. నాలుగేళ్ల క్రితం 2019 మే 30న ముఖ్యమంత్రిగా అధికారికంగా సంతకం చేసిన సందర్భంగా కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేసి మంగళవారం సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పగ్గాలు చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో చరిత్ర సృష్టించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం సీఎం అమలు చేశారని చెప్పారు. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు సాయాన్ని జమ చేస్తోన్న ప్రభుత్వాన్ని ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. ఆ దిశగా కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీలు అడవి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గా ప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు, కైకలూరు ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, సర్పంచ్ దానం మేరి నవరత్న కుమారి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనక దుర్గ రాణి, అగస్తి అదివిష్ణు, వైఎస్సార్‌సీపీ కలిదిండి మండల అధ్యక్షులు తిరుమాని రమేష్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామ రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

గుడివాడ వైఎస్సార్ సీపీ అడ్డా

ఎమ్మెల్యే కొడాలి నాని



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడటౌన్: రాజకీయాల్లోకి ఎప్పుడు వచ్చాం అనేది కాదు.. బుల్లెట్ దిగిందా లేదా అన్న విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక లింగవరం రోడ్డు లోని కె- కన్వెన్షన్ హాలులో మంగళవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ దేశంలోనే శక్తిమంతమైన సోనియాగాం. దీని ఎదిరించి నిలబడ్డ జగన్ మోహన్ రెడ్డిని చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కావాలని పవన్ కల్యాణ్, ప్రతిపక్ష హోదా కాపాడుకోవాలని చంద్రబాబు నాయుడు తపనపడుతున్నారని, ఈ రెండూ జరగవని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన పక్షాన నిలవవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కాపు సోదరులు తన వెంట ఉన్నారని 2024 ఎన్నికల్లో గుడివాడ గడ్డ వైఎస్సార్ సీపీ అడ్డా అని నిరూపిస్తామన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పడమటి సుజాత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, ఎంవీ నారాయణరెడ్డి, మెరుగుమాల కాళీ, పార్టీ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, మలిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు సిద్ధంగా ఉండండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజాబాబు

గుడివాడటౌన్: గుడివాడ పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన త్వరలో జరగనుందని, అందుకు కావలసిన ఏర్పాట్లు చేసేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశ హాలులో జిల్లా అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ మొదటి వారంలో ముఖ్యమంత్రి పర్యటన జరగాల్సి ఉందని, వర్షం కారణంగా ఇక్కడి వాతావరణం అనుకూలంగా లేనందున తిరిగి వారి పర్యటన ఎప్పుడు నిర్వహించాలనేది నిర్ణయిస్తామన్నారు. అయితే మచిలీపట్నంలో సీఎం పర్యటన విజయవంతం చేసిన నేపథ్యంలో ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహించారో అదే టీమ్, అవే బాధ్యతలు ఇక్కడ కూడా నిర్వహించాలన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకునే అధికారం టీమ్ లీడర్ తీసుకోవచ్చన్నారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు వైద్యం, మంచినీరు, మజ్జిగ, ఇతర సదుపాయాల ఏర్పాటుకు ఆయా శాఖల అధికారులు సిద్ధం కావాలన్నారు. హెలిప్యాడ్ ఏర్పాటు, నీటి సరఫరా, గతంలో చూసినవారే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపరాజితా సింగ్, డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ పి.పద్మావతి, డీఎస్పీ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు అగినపర్రు ఆలయాల్లో ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవం



అగినపర్రులోని వేణుగోపాలస్వామి, మార్కండేశ్వర స్వామి వార్ల దేవస్థానాలు

పమిడిముక్కల: అగినపర్రు గ్రామంలోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత మదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట, శ్రీ గంగా పార్వతీ సమేత మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో శిఖర, ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట మహోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ పాల్గొంటారని చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి మహా పూర్ణాహుతి, శాంతికల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గత రెండు రోజుల నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

గుడివాడలో భారీ వర్షం



గుడివాడటౌన్: పట్టణంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన ఈ వర్షం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఎక్కడి ప్రయాణికులు అక్కడే నిలిచిపోయారు. అప్పటివరకు ఎండ వేడిమి అధికంగా ఉండి, ఒక్కసారిగా ఊహించని రీతిలో వర్షం కురవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో అనేక రహదారులు జలమయమయ్యాయి.

రేపటి నుంచి పురుషోత్తమ భారతీ స్వామి విజయయాత్ర

విజయవాడ కల్చరల్: శృంగేరీ శివగంగ పీఠాధిపతి పురుషోత్తమ భారతీ స్వామి జూన్ 1వ తేదీ నుంచి వారం రోజులపాటు విజయ యాత్రలో భాగంగా శృంగేరీ పీఠ పాలిత శివరామకృష్ణ క్షేత్రంలో విడిది చేస్తున్నట్లు శివరామ కృష్ణ క్షేత్రం ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శివగంగ పీఠం వేద ధర్మానికి కట్టుబడి ఉందని, జగద్గురువులు ఆదిశంకర ఆశీస్సులతో పీఠం అనేక ధర్మకార్యాలను నిర్వహిస్తోందని దాన్ని అధిరోహించిన పురుషోత్తమ భారతీస్వామి విజయవాడలో అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. యాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- కురుమద్దాలిలో గడప గడపకు మనప్రభుత్వం



కురుమద్దాలిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు(పామర్రు): అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని కురుమద్దాలిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటంతో పాటు బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకోవటంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదోనని ఎమ్మెల్యే ఆరా తీశారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థుల పుస్తక పఠనం



మండవల్లిలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న పర్వీన

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం నీతి కథలు బోధించి, పుస్తక పఠనం చేయించారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీన మాట్లాడుతూ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

ముదినేపల్లిలో...

ముదినేపల్లిరూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం విద్యార్థులు పుస్తకపఠనం చేశారు. ఉపాధ్యాయులు విజ్ఞానాన్ని పెంచే పలు పుస్తకాలను చదివించారు. సంఘర్షణపురం, చిన్నపాలపర్రు, నరసన్నపాలెం, ముదినేపల్లి పశ్చిమ ప్రాథమిక పాఠశాలల్లో పుస్తక పఠనం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, ఇండోర్ గేమ్స్ పోటీలు లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయుడు బాబూరావు నీతికథల పుస్తకాలను చదివించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులతో కథలు చదివించి వాటి అర్థాలను వివరించారు.

హోమియో వైద్యంతో శాశ్వత నివారణ



ప్రయాణికులకు హోమియో వైద్యం గురించి తెలియజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

గుడివాడటౌన్: హోమియో వైద్యాన్ని వైద్యుల సూచనల మేరకు పూర్తి స్థాయిలో తీసుకుంటే వ్యాధికి శాశ్వత నివారణ ఉంటుందని డాక్టర్ గురురాజు హోమియో ప్రభుత్వ వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వడదెబ్బ నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోమియో వైద్యాన్ని ప్రజలకు అందించేందుకు ఎంతో కృషి చేస్తున్నాయని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకట్, క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాదు, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, బొగ్గరపు తిరుపతయ్య, పర్వతనేని చంద్రశేఖరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ మైక్రో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు

ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరరావు

కై కలూరు(కలిదిండి): ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేయడానికి ప్రతి గ్రామంలోనూ మండల పరిషత్ నిధులతో మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ఏర్పాటు చేస్తామని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. వివిధ ప్రభుత్వశాఖల పనితీరుపై ఆయన సమీక్ష చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. ప్రధానంగా హెల్త్ సబ్ సెంటర్లలో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉండాలని చెప్పారు. అవసరమైతే ఎంపీపీ నిధుల నుంచి మౌలిక వసతుల కల్పనకు నగదు కేటాయిస్తామన్నారు. మండలంలో నాడు – నేడు పనులు జూన్ చివరి నాటికి అధికారులు పూర్తి చేయాలని సూచించారు. ఎంఈఓ నరసయ్య పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందించే నోటు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలను ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రదర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, వైస్ ఎంపీపీలు కూసంపూడి కనకదుర్గారాణి, కట్టా నాగలక్ష్మి, తహసీల్దారు తేజోమణి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రవణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


హక్కుల సాధనే సీఐటీయూ లక్ష్యం

గుడివాడటౌన్: కార్మిక వర్గం పక్షాన పోరాటం చేస్తూ వారి హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక సంస్థ సీఐటీయూ అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక మినీ వ్యాన్ డ్రైవర్ల స్టాండ్ వద్ద మంగళవారం సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులు కాలరాస్తోందన్నారు. కార్మికులంతా ఐక్యతగా పోరాడాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ ఎలీషారావు, కౌంతి వెంకటేశ్వరరావు, రాము, ఐద్వా కార్యదర్శి రజిని, ఎండీ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి, చర్మవ్యాధుల వైద్య శిబిరం

గుడివాడటౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి, చర్మవ్యాధుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు టి.తిరుపతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోతిబొమ్మ సెంటర్ వద్ద గల ప్రతిభ గార్డెన్స్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ బండారు అంకిత, డాక్టర్ లలిత నేతృత్వంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచిత కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. గుడివాడ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదలకు మేలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

గుడ్లవల్లేరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో పేద ప్రజలకు మేలు చేకూరుతుందని డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. గుడ్లవల్లేరు పీహెచ్‌సీని ఆమె మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్, ఎన్‌సీడీసీడీ సర్వే, ఐడీసీఎఫ్ కార్యక్రమాల గూర్చి డాక్టర్ ఎన్.గోపాలనాయక్‌కు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

2న ఏఎన్ఆర్ కళాశాలలో మెగా జాబ్ మేళా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాని తదితరులు

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు పలు విధాలుగా కృషి చేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) అన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన గుడివాడ ఏఎన్ఆర్ కళాశాలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ అమలులో భాగంగా నైపుణ్యాభివృద్ధి సంస్థ 15 కార్పొరేట్ సంస్థలతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తోందన్నారు. ఈ జాబ్‌మేళాలో వెయ్యిమందికి పైగా ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. 7 నుంచి 10 తరగతులతో పాటు ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ, ఫార్మసీ, బీటెక్ పూర్తిచేసిన యువత దీనికి అర్హులన్నారు. నెలకు రూ.9 వేల నుంచి రూ.30 వేల వరకు వేతనం ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు, ఇతర అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.